# బానిస



## వల్లూరు శివప్రసాద్

నెల చివరి రోజుల్లో డబ్బులేక ఇబ్బంది పడటం రామారావుకి మామూలే. అయినా ఈ రకమైన ఇబ్బంది మాత్రం ఇటీవల ఎన్నడూ లేదు. మరుసటి రోజు నెల జీతం చేతికొస్తుంది అయితే ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా పోయింది.

ఆరుగంటలకే ఆఫీసు నుండి బయట పడ్డాడు. స్నేహితులతో బజార్లలో బాతాఖానీ కొడుతూ రాత్రి తొమ్మిది గంటల

*1984 చక్రపాణి అవార్డు కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ*

కల్లా ఇల్లు చేరుకోవటం అలవాటు. అలాటిది ఈ రోజు జేబులు ఖాళీ గావడంతో మనసంతా చికాకుగా వుంది.

ఆఫీసుకి, ఇంటికీ ఇంచుమించు నాలుగైదు కిలోమీటర్ల దూరం. సిటీబస్ ఎక్కితే పదిహేను నిముషాలు ప్రయాణం. కాని టికెట్ కొనేందుకు యాభైపైస లుంటేగా! నడక తప్పనిసరయింది.

జేబులో వున్న చిల్లర పోగేసి మూడున్నర గంటలకు ప్యూన్ చేత మూడు సిగరెట్స్ తెప్పించుకున్నాడు. గంటలోనే 'వుఫ్'న వూదేశాడు. అప్పటి నుండి ఇప్పటిదాకా మళ్ళీ సిగరెట్ దొరకలేదు.

రామారావు బజార్లో నడుస్తున్నాడన్న మాటేగాని బుర్ర ఏమాత్రం పనిచేయటం లేదు. చివరిగా సిగరెట్ తాగి మూడు గంటలవుతున్నది. సక్రమంగా వుంటే ఈపాటికి ఒక పది సిగరెట్స్ వూదేసి వుండేవాడు.

మనసు గుబులు గుబులుగా వున్నది.

"రాస్కెల్! ఎంత మోసంచేశాడు!" ఇప్పటికి వందసార్లయినా తిట్టుకున్నాడు రాజుని.

జీవితంలో ఎన్నో విషయాల పట్ల అంతగా లేని ముందుచూపు సిగరెట్స్ విషయంలో ఎప్పుడూ వుంటుంది. రోజు వారి ఖర్చులో మొదటిగా జాగ్రత్త పడేది ఒక్క సిగరెట్స్ గురించే. ఆ తర్వాతనే ఏదయినా సరే!

మధ్యాహ్నం లంచ్ అవర్లో రాజుని అడిగాడు. "రాజూ! పది రూపాయిలు సర్దవోయి. రేపిస్తాను." అని.

"చిల్లర లేదు. యాభైనోటుంది. సాయంత్రం వెళ్ళేప్పుడు మార్చిఇస్తాన్లే." అన్నాడు రాజు.

ఈ రోజుకు గండం గడిచినట్లే నను కున్నాడు రామారావు. ఐదు గంటలదాకా నిశ్చింతగా ఫైళ్ళల్లో తలదూర్చాడు. ఐదు దాటుతూనే సిగరెట్ కోసం తడుముకున్న ప్పుడు రాజు సంగతి గుర్తొచ్చింది.

అతను మర్చిపోయి వెళ్ళిపోతే కొంపలంటుకుంటాయని, 'తనొచ్చేవరకు వెళ్ళొద్దని' ప్యూను ద్వారా ప్రక్క సెక్షన్లో వున్న రాజుకు కబురు పెట్టాడు.

ప్యూన్ వస్తూ పిడుగుపాటు వార్త తెచ్చాడు. "ఇంటి దగ్గర్నుండి ఎవరో బంధువులొస్తే ఇప్పుడే హడావుడిగా వెళ్ళిపోయారటండీ!" అంటూ.

రామారావు నీరుగారిపోయాడు. కొద్ది నిమిషాలు కాళ్ళుచేతులాడలేదు. ముళ్ళ మీద కూర్చునట్లే వున్నది సీట్లో. లేచి వెళ్దామంటే యముడిలా సూపర్నెంట్ కనిపిస్తున్నాడు.

"ఈ ఫైల్ ఉదయమే పుటప్ చేయాలి. వెరీ అర్జంట్" అంటూ అరగంట క్రితమే మెడకు కట్టాడు.

ఒక గంటలో ఆ పని ముగించి సూపర్నెంట్ ముందు పడేశాడు. అయన్నే చేబదులు అడగుదామా అనుకున్నాడు.

'అప్పు స్నేహానికి ముప్పు' అన్నది ఆయన సూక్తి. చస్తే ఎవరికీ పైసా చోటు పెట్టడు. అడిగీ లాభం లేదను కున్నాడు.

పోయినవాళ్ళు పోగా, ఇక సెక్షన్‌లో వున్నది మాత్రం ఎందరు? కొగిలాల్సి ఇంకా గెలుకుతూ అకౌంటెంట్ వరదయ్యా, శరత్ వున్నారు. వరదయ్య నడిగితే ఇస్తాడేమో కాని నలుగుర్లో పరువుంచడు.

"ఏమిటండీ? రామారావు ఎప్పుడూ అప్పులకోసం ఎగబడుతుంటాడు. దుర్వ్య సనాలు గట్రా వున్నాయేమిటి?" అంటూ ప్రతివాడి దగ్గరా వూదరకొట్టేస్తాడు.

అందుకే అతన్నడగకూడ దను కున్నాడు. తన దగ్గరుంటే శరత్ పది రూపాయలు ఇవ్వకపోడు.

"శరత్! పది రూపాయలుంటే ఇస్తావా? రేపిచ్చేస్తాను. బొత్తిగా సిగ రెట్స్‌కి లేకుండా పోయాయి." అడిగాడు రామారావు.

శరత్ ఓ నిముషం ఎగాదిగా చూశాడు. అతని పల్చటి చొక్కా జేబులోనుండి పదినోటు కనిపిస్తూనే వుంది. ఇస్తాడనే ఆశపడ్డాడు.

"సారీ బ్రదర్! నీ అవసరం మరో కటి ఐతే కాదనలేకపోయేవాణ్ని" అన్నాడు నిర్మొహమాటంగా.

రామారావుకి చిర్రెత్తుకొచ్చింది. 'ఏం చేసుకుంటేనేం, ఇస్తున్నది ధర్మం కాదుగా?' అందామనిపించింది. వాడి బుద్ధి ఎరిగి అబద్ధం చెప్పి పబ్బం గడుపు కొనక తెలివితక్కువతనంతో నోరు జారాడు.

ఈ మధ్యనే శరత్ సిగరెట్స్ తాగడం మానేశాడు. ముఖ్యులైన స్నేహితులకు టీ పార్టీ ఇచ్చి, ఏదో ఘన కార్యం సాధించినవాడిలా ఉపన్యాసం కూడా ఇచ్చాడు.

'డియర్ ఫ్రెండ్స్! ఈ రోజు పార్టీ ఇస్తున్న కారణం మీకు చాలా చిన్న దనిపించవచ్చు. ఈ మాత్రానికేనా అని హేళన చేసినా, నా తృప్తికోసం చేస్తు న్నది కనుక అందుకు బాధపడను.

'సిగరెట్స్ తాగడం మానేశాను. నాలో ఎంతోకాలంగా వేళ్ళూనిన ఈ బల హీనతను వదిలించుకోవటం నా జీవిత పరిధిలో ఒక గొప్ప విజయంగానే భావిస్తున్నాను. స్మోకింగ్ హేబిట్ ఈనాడు ఒక కామన్ ఫ్యాషన్ అయి పోయింది. దురల్వాటుగా భావించని రీతిలో ఇది మధ్యతరగతి జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నది.

'అనిస అవసరంగా ఇంతకాలం ఈ వ్యసనానికి బానిసలా లొంగిపోయాను. మానసిక ఆనందాన్ని పొందుతున్న భ్రమలో నేను పీల్చే ప్రతి పీలుపుకు నా కుటుంబ సౌఖ్యం ఎంతగా దహించబడు తున్నదో గ్రహించేందుకు నాకు ఇన్నాళ్ళు పట్టింది.

'ఆ సిగరెట్స్ కోసం ప్రతి నెలా తగలెట్టే రెండువందల రూపాయల్ని ఏ బాంకులోనో దాచుకోగలిగితే ఇరవై సంవత్సరాలకి అది మొత్తం ఒకలక్ష అరవై మూడువేల రూపాయలు అవుతుందంటే మీరు ఆశ్చర్యపోవచ్చు. దాన్నిబట్టి ఈ అలవాటు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికపరంగా ఎంతగా దెబ్బతీస్తున్నదో అర్థంచేసుకోవచ్చు. ఈ పార్టీ ఉద్దేశం, నాలా ఎవరైనా మానుకోగలిగితే మిత్రుడిగా సంతోషించటానికే.' ఉద్వేగంతో ముగించాడు శరత్.

అలవాటున్నవాళ్ళు పరిహసిస్తే, అలవాటులేని కొందరు ప్రశంసించారు ఆ రోజు.

అలాంటివాడు సిగరెట్స్ కోసమంటే ఎందుకిస్తాడు? చిన్నబుచ్చుకుని ఇవతలకు వచ్చాడు రామారావు. బజార్లో తెలిసిన ముఖం కనిపించకపోతుందా అన్న ధైర్యంతో ఆఫీసు వదిలి బయటకొచ్చేశారు.

ఎనిమిదిగంటలు కావస్తున్నా ఒక్కడూ తెలిసినవాడు తారసపడలేదు. 'ఏమైపోయారీ వెధవలంతా? అవసరమున్నప్పుడే ఒక్కడూ కనిపించి చావడు!' చాలాసార్లు విసుక్కున్నాడు.

సిగరెట్ పీల్చి మూడు గంటలు దాటుతున్నది. నాలుక ఒకటే పీక్కుపోతున్నది. చివ్వలాసంగా సిగరెట్ పొగ వదుల్తూ బజార్లో ఎవడు కనిపించినా ప్రాణం గిజగిజలాడుతున్నది.

రోడ్డుప్రక్కన కూర్చుని అడుక్కుంటూనే బీడిదమ్ము కొడ్తున్న ముష్టివాణ్ని చూస్తూనే వళ్ళుమండింది రామారావుకి.

'నాలుగంకెల జీతగాడై వుండీ, అర్థరాల్ సిగరెట్ పీకలకోసం ఎంతసేపట్నుండి విలవిలలాడిపోతున్నాడు!' తనమీద తనకే కోపం వస్తున్నది రామారావుకి.

ఆకర్షణీయమైన రంగులతో ఖరీదైన సిగరెట్ పేకెట్ ఒకటి రోడ్డుమీద కనిపించింది. 'పొరపాటున ఎవరైనా నిండు పేకట్ రోడ్డుమీద పారేసుకు వుండకూడదూ?' పేరాశతో దాన్ని అసంకల్పితంగా తన్నేడు, దాటిపోతూ.

ఖాళీపెట్టె కసుక్కున నవ్వినట్లుగా ఎగిరి ముందు నడుస్తున్న ఒకామెకి తగిలింది ఆమె చివాలున వెనుదిరిగి చురచురా చూసింది. ప్రక్కన నడుస్తున్న వాళ్ళు 'నీకేం పోయేకాలంరా?' అన్నట్లుగా చూసేరు.

రామారావు ప్రాణం బిక్కచచ్చిపోయింది. తను కాదన్నట్లుగా ముఖం తిప్పుకుని ఎటో చూస్తున్నట్లుగా నిలబడ్డాడు ఓ నిమిషం.

"ఎక్స్క్యూజ్ మి సర్! మాచెస్ వుంటే ఇస్తారా?" అడిగాడొకతను వినయంగా.

అతని వేళ్ళమధ్య కదులాడుతున్న

సిగరెట్ చూస్తుంటే అసూయ వేసింది రామారావుకి, 'ఇదో రకమైన ముష్టి. వెధవకానా అగ్గిపెట్టె లేనివాడివి సిగరెట్ కాల్చడం దేనికి?' మనసులోనే కసిగా తిట్టుకుంటే 'సారీ! లేదు... ' అంటూనే ముందుకు నడిచాడు.

కాలం గడుస్తున్నకొలది రామారావుకి తిక్కతిక్కగా వున్నది. అసహనంతో పిచ్చి ఎక్కుతున్నట్లుంది. వికృతమైన ఆలోచనలతో మనసు దారి తప్పుతున్నది.

ఆనందంగా సిగరెట్ పీలుస్తూ వెళ్తున్న ప్రతివాడ్నీ చెంపలు వాయిద్దామనీ, దారిపొడవునా కనిపిస్తున్న కిళ్ళీ బంకుల్ని ధ్వంసం చేద్దామనీ, సైన్ బోర్డులనిండా బురద చిమ్మాలనీ.... ఇంకా పిచ్చిపిచ్చి ఊహలు.

నోటికొచ్చినట్లు తిడుతూ బజార్లో పరిగెత్తాలనీ అనిపిస్తుంది. కసి... కసికసి .... తనమీదనూ, ఈ లోకంమీదనూ, ఈపాటి అవసరానికి అల్లాడిపోతున్న తన దౌర్భాగ్యం మీదనూ ద్వేషం రగులుతుంది.

"హల్లో! రామారావుగారూ!" ఎవరిదో పిలుపు వినబడుతూనే ప్రాణం లేచి వచ్చినట్లయింది. జీవితంలో ఎన్నడూ కలగనంత థ్రిల్‌తో ప్రక్కకు చూశాడు.

గారపళ్ళు బయటపడేలా ఇకిలిస్తూ సంజీవరావు. ఆ థ్రిల్ కాస్త అతన్ని చూస్తూనే జావగారిపోయింది. రామారావు అసహ్యించుకునే అతి కొద్దిమందిలో అతనొకడు సాటి ఉద్యోగుల దగ్గర చేబదుళ్ళు చేస్తూ, అవసరమైన వాళ్ళకు వందకు పదిరూపాయల చొప్పున వడ్డీలకు తిప్పుతుంటాడు.

"ఏమండీ! బొత్తిగా నల్లపూసయి పోతున్నారు కనిపించటం లేదేం!" పలకరింపుగా నవ్వుతూ, జేబులోనుండి సిగరెట్ పేకెట్ తీసి ఒకటి వెలిగించుకున్నాడు.


మొదటి పీలుపు తాలూకు కమ్మని పొగ వాసన రామారావుని ముక్కుని మత్తెక్కించింది.

'మేనర్‌లెస్ బ్రూట్!' సిగరెట్ ఆఫర్ చేయనందుకు మనసులోనే కసిగా తిట్టుకున్నాడు. వాడ్ని క్రింద పడేసి జేబులోనుండి పేకెట్ లాక్కొని, మేనర్స్ నేర్చుకోమని చెప్దామన్నంత ఆవేశం వచ్చింది.

అంతలోనే నిగ్రహించుకొని, "సారీ! అర్జంటు పనుంది" అంటూనే ముందుకు కదిలాడు రామారావు.

అప్పటికే ఎనిమిదిన్నరయింది. నడిచి నడిచి రామారావుకి కాళ్ళు పీక్కుపోతున్నాయి. నరాలు పట్టులేక చచ్చుబడుతున్నట్లుంది. తెలిసినవాళ్ళు కనిపిస్తారన్న ఆశ వదులుకొని, గత్యంతరం లేక కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి దారితీశాడు రామారావు.

ఉదయం ఆఫీసుకు వచ్చేప్పుడే ఇంట్లో గాలిస్తే పైసా దొరకలేదు.




కనుక ఇంట్లో దొరుకుతుందన్న ఆశా లేదు. కోరిక అతని నరనరాన్ని మెలికలు తిప్పుతున్నది.

ఇంటి పరిసరాలలో వున్న కిళ్ళీ బంక్ చూస్తూనే 'రేపిస్తానంటే అప్పు ఇవ్వకపోతాడా!' అన్న ఆశ చిగురించింది రామారావుకి.

అడపాదడపా అక్కడ సిగరెట్స్ కొంటూనే వుంటాడు. అప్పుగా ఎన్నడూ, అడగలేదు గనుక మొహమాటంతోనైనా ఇస్తాడని ఆశించాడు. హుషారు తెచ్చుకుంటూ కొట్టుకేసి నడుస్తున్నంతలో కొట్టువాడి గావుకేకలు చెవినబడి ఆగిపోయాడు.

"ఏవిటయ్యా నీతో మొహమాటం! అంతగా డబ్బుల్లేవని దేబిరించకుంటే తాగటం మానెయ్యరాదూ! పెట్టి అమ్మితే మా కొచ్చే లాభం పది పైసలుండదు. పదులూ, పాతికలూ బాకీలు పెట్టి మేం చిప్పెత్తుకు తిరగాలి. వెళ్ళెళ్ళు...." అరుస్తున్నాడు ఎవరినో.

"బాబ్బాబు, కాదనకు! నా బాకీ రెండ్రోజుల్లో అణా పైసల్తో తీర్చేస్తాను. గంటనుండి బీడీముక్కన్నా దొరక్క చచ్చిపోతున్నాను." ప్రాధేయపడుతున్నాడు అతను.

"నీ డబ్బూ వద్దు. నువ్వూ వద్దూ! నీలాటోళ్ళకు బాకీలెట్టి ఇప్పటికి చేతులు కాల్చుకున్నది చాలు. పోవయ్యా అవతలకు" ఛీత్కరిస్తున్నాడు.

రామారావు అక్కడ క్షణం నిలవలేకపోయాడు. ఆ మాటలు తననంటున్నట్లే గబగబా ఇంటికేసి నడిచాడు.

ముందుగదిలో పిల్లలిద్దరూ చదువుతూ

కనిపించారు. భార్య వంటింట్లో వుందన్న ఉద్దేశంతో నేరుగా వంటింట్లోకి నడిచాడు రామారావు.

"స్నానానికి వేడినీళ్ళు పెట్టమంటారా?" అడిగింది సుశీల.

అడ్డంగా తలూపాడు రామారావు "పాలుంటే ఓ కప్పు టీ పెట్టి ఇవ్వు." అడిగాడు.

"పెట్టుకొస్తాను అంతలో బట్టలు మార్చుకోండి." టీ పెట్టడంలో నిమగ్న మైంది సుశీల

రామారావు బెడ్‌రూంలోకి వచ్చి బట్టలు మార్చుకున్నాడు పొరపాటున విడిచిన చొక్కా జేబుల్లో అడుగుబొడుగు చిల్లర ఏమున్నా వుందేమోనన్న ఆశతో వెదికి చూశాడు. ఫలితం లేకపోయింది.

నిరుత్సాహంగా బెడ్‌మీద వాలి పోయాడు. అంతలో సుశీల టీ చేసి తీసు కొచ్చి ఇచ్చింది.

"సుశీ! ఇంట్లో చిల్లర డబ్బులేమన్నా వున్నాయా!" అడిగాడు.

"ఎక్కడివి! లేదనే ఉదయం కూర గాయలవాడికి చెప్పేశాను. నా నాలుగు రోజులుగా వున్న పదిరూపాయలు మీరే సిగరెట్లకోసం తగలేశారు " అంది సుశీల.

రామారావు వుసూరుమన్నాడు.

వేడివేడి టీ కడుపులో పడటంలో కోరికతో మనసు తహతహలాడి పోతున్నది. ఆ కతి తీర్చుకునే మార్గం తోచక పిచ్చెత్తినట్లు జుట్టు పీక్కున్నాడు.

కాలు నిలవక లేచి ముందు గదిలోకి వచ్చి కూలబడ్డాడు.

పుస్తకాల షెల్ఫ్‌లో వున్న రెండు కిడ్డీబ్యాంక్ బొమ్మల్ని చూస్తూనే రామారావు ప్రాణం కోరిక రెక్కల్ని తొడుక్కుంది. వాటిల్లో ఏ కొద్దయినా చిల్లర వుండకపోదనుకున్నాడు.

లేచి వెళ్ళి ఒక బొమ్మ చేతిలోకి తీసుకు కదిలించి చూశాడు. పైసా కూడా అందులో లేనట్లుంది. చిరాగ్గా ఎవరలకు విసిరిపడేసి రెండవదాన్ని అందుకున్నాడు.

పిల్లలిద్దరూ పుస్తకాల్లోంచి తలెత్తి చూశారు రామారావుకేసి. రెండో బొమ్మ తండ్రి చేతిలోకి తీసుకోవటం చూస్తూనే చిన్నవాడు విశ్వం గాభరాపడ్డాడు. తండ్రి ఉద్దేశం వాడికి తెలుసు

రామారావు బొమ్మను కదిలించేసరికి చిల్లర గల్లుమంది. విజయోత్సాహంతో మనసు చిందులువేసింది. తెరిచేందుకు సంబరు తిప్పుతున్నంతలో విశ్వం అమాంతం తండ్రి దగ్గరకు దూకి బొమ్మను లాగేసుకున్నాడు.

అనుకోని అవాంతరానికి రామారావు ఉలిక్కిపడ్డాడు చిరాకును అణుచుకుంటూ విశ్వం దగ్గరకు వెళ్ళాడు.

"విన్నూ! అప్పుగా ఇవ్వరా! వడ్డీతో సహా రేపిచ్చేస్తానుగా!" బ్రతిమాలటం మొదలెట్టాడు.

"వూహుం! నే నివ్వను."




"రేపు జీతాలొస్తాయిరా! బోలెడు డబ్బులొస్తాయి. ఇచ్చేస్తానంటున్నాగా!" బుజ్జగిస్తున్నాడు.

"ఊఁహూఁ! ఇదివరకు ఎన్నిసార్లు ఇలా చేయలేదూ! అన్నయ్య డబ్బులన్నీ కాజేశావు!"

"ఈసారి నిజంగా ఇస్తానురా! మా బాబు కాదూ!"

"ఆఁ! ఇచ్చినట్లే ఇచ్చి ఎన్నిసార్లు లాగేసుకోలేదు! నేనివ్వనంటే ఇవ్వను." బొమ్మను కాళ్ళ మధ్యన ఇరికించుకుని ఇంకా బిగుసుకున్నాడు.

రామారావు సహనం కోల్పోతున్నాడు. అయినా నిగ్రహించుకుంటున్నాడు.

"విస్సూ! రేపు సినిమాకు కూడా తీసికెళ్తానురా! ఇంకేం కావాలన్నా

కొనిస్తాను." ప్రాధేయపడసాగాడు కొడుకును.

ఆ మాటలు విశ్వం చెవికెక్కడం లేదు.

"నాకూ, అన్నకూ క్రికెట్ బ్యాట్ కొనిస్తానని మాయజేసి డబ్బులన్నీ లాగేసుకున్నావు. మరి కొనిచ్చావా?"

ఆ మాటలకు తడుముకున్నాడు రామారావు. "రేపే కొనిస్తానురా!.... ఇవి మాత్రం నేనిచ్చినవి కాదట్రా?"

"కాదు. మావయ్యా, బాబాయి, పిన్ని వాళ్ళొచ్చినప్పుడు ఇచ్చినవి దాచుకున్నాం, క్రికెట్ బ్యాట్ కొనుక్కుందామని. మేం చూడకుండా అమ్మ కూడా దాజేసింది." ఉక్రోషంగా అన్నాడు విశ్వం.

"సిగరెట్లకు కూడా లేవురా! త్వరగా ఇవ్వకుంటే కొట్టుమూసేస్తాడు" విసుగ్గా అన్నాడు రామరావు.

"మూస్తే నాకేం!.... బోడి ..సిగరెట్లు .... ఈ డబ్బులు నీవేంకాదు. నావి నా యిష్టం. . వెళ్ళు... ఫో! .." విదిలించేసి ముఖం తిప్పుకున్నాడు విశ్వం.

రామారావు అహం దెబ్బతిన్నది. వేలెడలేని వెధవని ఇంకాగా ప్రాధేయ పడటమేమి అనుకున్నాడు. కోపంలో మనసు స్వాధీనం తప్పింది

"ఇదేం నీ తాతగాడి సొమ్మట్రా! వెధవకానా, ఇవ్వకుంటే చంపేస్తాను. ఇలాతే!" మీదపడి గుంజుకోబోయాడు రామరావు.

బొమ్మ అందకుండా రామరావు చేతుల్ని కాళ్ళతో విసురుగా తన్నిపడేశాడు విశ్వం.

ఆ మొండితనానికి రామరావు కోపంతో వళ్ళుమరిచిపోయాడు రామరావు. శివ మెత్తినవాడిలా లేచి గోడకున్న బెల్టు అందుకున్నాడు.

"ఎంత పొగర్రా, రాస్కెల్ నీకు!" అరుస్తూ బెల్టుతో చావబాదసాగాడు.

పెద్దవాడు రవి భయంతో లోపలికి పరిగెత్తాడు. బెల్టుదెబ్బలు తింటూ ఏడుస్తున్నా విశ్వం బొమ్మ మాత్రం వదలి పెట్టటంలేదు. ఈ గందరగోళానికి సుశీల వంటింట్లోనుండి పరిగెత్తుకొచ్చి అడ్డం పడబోయింది.

రామరావు భార్యను అవతలకు తోసేసి, ఏడేళ్ళ పసివాడన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా విజృంభించాడు.

సుశీల బావురుమని ఏడుస్తూ, విశ్వాన్ని కౌగిలిలోకి తీసుకొని దెబ్బల్ని కాసుకుంది. ఆమె వంటిమీద దెబ్బలు పడ్డాయి.

"ఇడియట్! చిన్నవాడని మారాం చేస్తుంటే నెత్తికి ఎక్కుతాడా! చంపి పారేయాలి." ఆవేశంతో రొప్పుతున్నాడు.

సుశీల విశ్వం చేతిలోని బొమ్మను బలంగా గుంజుకొని విసిరికొట్టింది. "ఛీ!ఛీ! మీరు మనిషా, పశువా! మీక్కా-

ల్సింది చిల్లరేగా. తీసుకెళ్ళి తగలెట్టండి." అరుస్తూ ఏడుస్తూనే విశ్వాన్ని హృదాయానికి హత్తుకున్నది.

"నాన్నా! తమ్ముణ్ణి కొట్టకు. ఇవిగో తీసుకో." అంటూ లోపల్నుంచి పరుగెత్తుకు వచ్చాడు.

"ఎక్కడివిరా నీకు?" గద్దించాడు రామరావు.

"తాతయ్య వచ్చినప్పుడు ఇచ్చేడగా. మిగిలితే దాచుకున్నాను," అని చెప్పాడు ఏడుపుముఖం పెట్టి.

రామరావు బెల్టు అవతలకు విసిరేసి, రవి చేతిలోని చిల్లర అందుకున్నాడు. "చావు వెధవని! ఈసారి వెధవ్వేషాలు వేశావంటే గొంతు పిసికేస్తాను. నీ ముష్టిడబ్బులుంచుకో." అంటూ వొమ్మును కాలితో వాడికేసి తన్ని బయటకు వెళ్ళిపోయాడు.

విశ్వం వెక్కిళ్ళుపెడ్తూ ఏడుస్తున్నాడు. వాడి శరీరంమీద బెల్టు దెబ్బలకు ఎర్రగా కమిలిపోయి వాతలు తేలింది.

రామరావు పదినిమిషాల్లో కొట్టు దగ్గరకు చేరుకున్నాడు. చిల్లరకు సరిపడా నాసిరకం సిగరెట్స్ తీసుకున్నాడు. ఆబగా ఒక్కటి వెలిగించుకొని గుప్పు గుప్పున పొగ వదులుతూ, తృప్తిగా ఈ ప్రపంచాన్నే మరచిపోయాడు.

అంతవరకున్న తపనా, ఆరాటం కొంతవరకు తగ్గింది. వెంటనే మరోటి వెలిగించాడు. దమ్ముదమ్ముకూ పొగ గుండెల్నిండా పీల్చుకుంటుంటే మనస్సు తేలికపడి గాల్లో విహరిస్తున్నట్లుంది. అక్కడక్కడనే పచార్లు చేస్తూ నింపాదిగా పీల్చాడు. అప్పుడుగాని మనిషి కాలేకపోయాడు రామరావు.

ఐదుగంటల కాలం మనసును అధీనంలోకి తీసుకొని అల్లకల్లోలంచేస్తూ పెత్తనం చెలాయించిన పొగదయ్యం తాత్కాలికంగా వదలివెళ్ళింది. మనసు స్వాధీనంలోకి వచ్చింది.

కేవలం చిల్లరడబ్బులకోసం కన్నకొడుకుపట్ల ఎంత అమానుషంగా ప్రవర్తించాడో అప్పుడే స్ఫురణకొస్తున్నది. వెంటనే ఇంటికి వెళ్ళేందుకు మనసొప్పక కొద్దిసేపు తచ్చట్లాడిన తర్వాత వెళ్ళాడు.

రవి నిద్రపోతున్నాడు. సుశీల విశ్వం వంటిమీదపడిన వాతల్ని నూనెగుడ్డతో సున్నితంగా అద్దుతుంది. వాడి బుగ్గలమీద కన్నీటి చారికలు కనిపిస్తున్నాయి.

తన రాక్షసత్వపు ముద్రల్ని ఆ లేత పసిమిదేహం మీద స్పష్టంగా చూడగలిగాడు. హృదయాన్ని ముల్లుతో పొడిచినట్లు చురుక్కుమన్నది. చూడలేక ముఖం తిప్పుకున్నాడు.

"సిగరెట్ తాగడమే అన్నిటికన్నా మీకు ముఖ్యమైంది. అందుకోసం ఇంతగా పసివాణ్ని చావగొట్టాలా?" కళ్ళొత్తుకుంటూ అన్నది సుశీల.

రామరావు నోరెత్తలేకపోయాడు. బెడ్ మీద వాలిపోయి కళ్ళు మూసు

కున్నాడు. తన విచక్షణా రహితంగా రెచ్చిపోయాడుగాని, ఇంకొద్దిసేపు బ్రతిమాలితే వాడే ఇచ్చిఉండేవాడనిపించింది.

కేవలం ఆకతాయితనంగా చదువుతున్న రోజుల్లో నేర్చుకున్న సిగరెట్ అలవాటును నయానా, భయానా ఎందరు చెప్పినా మానలేదు.

"ఎందుకీ పాడు అలవాటు మనం తిన్నట్లా, ఒకరికి పెట్టినట్లా? ఇల్లా వళ్ళు గుల్ల చేసుకోవటమేగా! కాల్చటం మానేస్తే నెల [illegible] ఇబ్బం[illegible] కుంటూ ఉన్నా?" సుశీల ఎన్నిసార్లు ప్రాధేయపడినా అతనికి చీమకుట్టినట్లనిపిస్తేగా!

"త్వరగా స్నానం చేసిరండి. భోజనం వడ్డిస్తాను." అన్నది సుశీల వచ్చి.

రామారావు ఆలోచనల్నుండి తేరుకొని, స్నానం చేసేందుకు వెళ్లాడు.

"నాకే వడ్డిస్తున్నావు! నువ్వు తినవేం?" అన్నంముందు కూర్చుంటూ అడిగాడు.

"నాకు ఆకలిగా లేదు. మీరు తినండి." అన్నది ముఖం తిప్పుకుంటూ

ఆమెకు ఆకలి లేకపోవటానికి కారణం రామారావుకి తెలుసు. తన తొందరపాటుకు క్షమాపణ చెప్పుకొని ఓటమి నంగీకరించటం చిన్నతనమనిపించింది.

తిన్నట్లు నాలుగు ముద్దలు కతికి లేచి వెళ్ళాడు.

కళ్ళుమూసుకు పడుకున్నాడన్నమాటేగాని నిద్రపట్టలేదు సరిగా.

విశ్వం ఉలికిపాటుగా నిద్రమేలుకొంటూ భయంతో అస్పష్టంగా కలవరిస్తున్నాడు. ఆ పసివాడ్ని ప్రేమగా చేరదీసేందుకు అహం అడ్డువస్తుంది.

* * *

ఉదయానికల్లా విశ్వానికి జ్వరం వచ్చింది. శరీరం పచ్చిపుండులా మంట పుట్టింపే వుంటుందీ బాధగా మూలుగుతున్నాడు. రామారావు ఒక ప్రక్క ఆఫీసుకు తయారవుతూనే లోలోన మూగవేదన అనుభవిస్తున్నాడు.

"ఆఫీసుకి వెళ్తే సాయంత్రమేగా వచ్చేది. విస్సూకి జ్వరంగా వున్నట్లుంది" రామారావుతో చెప్పింది సుశీల.

భార్య కళ్ళల్లోకి సూటిగా చూసే సాహసంలేక, రామారావు దోషిలా ముఖం చాటుచేసుకున్నాడు. హాస్పిటల్‌కి వెళ్ళాలంటే డబ్బు కావాలి. జీతాలు సాయంత్రానికి గాని అందవు. ఏం చేయాలో స్ఫురించలేదు వెంటనే.

"సుశీ! క్రితంసారి జ్వరం వచ్చినప్పుడు వాడగా మిగిలిన బిళ్ళలు ఒకటో, రెండో వుండాలిగా. ప్రస్తుతానికి అవే మింగించు. మధ్యాహ్నం లంచ్ అవర్లో వస్తాను." బిళ్ళలు వెతికి సుశీలకిచ్చాడు.

సుశీల మౌనంగా అందుకొని విశ్వం చేత మింగించింది.

రామారావు బయటకు వెళ్ళబోతూ విశ్వంకేసి చూశాడు. ఆ పసివాడి వంటి

మీద ఎర్రబారిన వాతల్ని చూస్తుంటె హృదయం కెలికినట్లవుతుంది. వాడనుభవిస్తున్న బాధ ముఖంలో కనిపిస్తూనే వున్నది.

"మధ్యాహ్నం తప్పకుండా వస్తాను. జీతాలందుకున్న హుషారులో ఇల్లే మర్చిపోతారా!" ఎత్తిపొడుపుగా అన్నది సుశీల.

ఆమె మాటలు రామారావు హృదయంలో సూటిగా నాటుకున్నాయి. కన్న తండ్రి మమకారం అహంకారపు తెరల్ని తొలగించుకున్నది. మంచంమీద విశ్వం ప్రక్కనే కూర్చొని నుదుటిమీద తాకి చూశాడు. వేడిగా వున్నది.

తండ్రి చేతిస్పర్శకు విశ్వంలో కాస్త కదలిక వచ్చింది.

"పీలుచేసుకొని మధ్యలో ఓసారి వచ్చిపోతాను. అంతగా జ్వరం లేదనుకుంటా. బెంగారుపడకు." అంటూనే లేచి బయటకు వెళ్ళేందుకు నాలుగడుగులు వేశాడు.

ఆ మాటలకు కనులు విప్పార్చిన విశ్వానికి వెళ్తున్న తండ్రి కనిపించాడు. "నాన్నగారూ!" ఓపికనంతా కూడదీసుకుని అరిచాడు.

ఆ పిలుపుకు వెళ్తున్నవాడల్లా వెనుదిరిగి వచ్చాడు రామారావు. "ఏం నాన్నా! ఏం కావాలా?" అడిగాడు ప్రేమగా స్పృశిస్తూ.

విశ్వం చేతులు దిండుక్రిందకు వెళ్ళాయి. అటూ ఇటూ తడిమి భద్రంగా దాచుకున్న కిడ్డీబ్యాంక్ బొమ్మను బయటకు తీశాడు.

"నాన్నగారూ! ఇందులో డబ్బులన్నీ తీసుకో.... మళ్ళీ ఏం ఇవ్వానవసరం లేదులే.... తీసుకో మరి!" అన్నాడు చేయి ముందుకు జాపుతూ.

ఆ చిన్నవాడి అమాయకత్వం, ప్రేమ, క్షమాగుణం రామారావు హృదయాన్ని చలింపజేసాయి. ఉద్వేగంతో విశ్వం ముఖంమీదకు వంగి ముద్దులు పెట్టాడు. వెచ్చని కన్నీటి చుక్కలు వాడి ముఖంమీద రాలాయి.

"విశ్వా!... నాన్నా... ఇంటికొస్తారా!" దుఃఖంతో కంఠం పూడుకుపోతుంటే, ఎక్కువ వుండలేక బయటకు నడిచాడు, కన్నీటిని చేతివేళ్ళతో అద్దుకుంటూ.

పసిబాలుని ప్రేమించే హృదయమే తప్ప ఏ కల్మషమూ లేని ఆ చిన్నారి బొమ్మ ముందు తను గడ్డిపోచలాంటి వాడననుకున్నాడు రామారావు.

ఒక వ్యసనానికి బానిసై రాక్షసుడిలా ప్రవర్తించి తనెంత అల్పుడైనాడో బోధపడింది. ఆనాడు శరత్ మాటల వెనుకనున్న ఆవేదనా, వాస్తవికతా రామారావు మనసును ప్రభావితం చేస్తున్నాయి.

ఆత్మవిశ్వాసానికీ, బలహీనతకూ మధ్య అతని మనసు వూగిసలాడుతున్నది.

ఆఫీసుకు వెళ్తూనే రాజుని కలిసి యాభై రూపాయలు అప్పు తీసుకొని ఓ గంట పర్మిషన్ పెట్టి ఇంటికి వెళ్ళాడు. అప్పటికే జ్వరం కాస్త తగ్గుముఖం పడ్తున్నట్లుంది

"సుశీ! విస్సూని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి చూపించు. సాయంత్రం త్వరగా వచ్చేస్తాను." డబ్బు సుశీల చేతిలో పెట్టి ఆఫీసుకు వచ్చేశాడు.

సాయంత్రం ఐదున్నరవుతూనే ఇల్లు చేరుకున్నాడు రామారావు.

తండ్రిని చూస్తూనే పిల్లలిద్దరూ, "నాన్నగారు వచ్చేశారోచ్!..." సంతోషంగా అరిచారు.

విశ్వం హుషారు చూస్తూనే రామారావు మనసు కుదుటపడింది. "నాన్నలూ!... జ్వరం తగ్గిపోయినట్లుందిరా!" చేతుల్లోకి తీసుకు చూశాడు.

వళ్ళు చల్లగా వున్నది. విశ్వం ముఖం కూడా తేటగా కనిపించింది. నిశ్చింతగా వూపిరి తీసుకున్నాడు రామారావు.

"డాక్టర్‌గారు మందిచ్చారు నాన్నగారూ! అందుకే బుడుంగున తగ్గింది జ్వరం." అన్నాడు తమాషాగా ముఖం పెడుతూ.

రామారావు రాకను వంటింట్లోనుండే పసిగట్టి, సుశీల టీకప్పుతో వచ్చింది.

ఆఫీసునుండి వస్తూ తెచ్చిన బ్రెడ్, బిస్కట్లూ పిల్లలిద్దరికీ ఇచ్చాడు. షెల్ఫ్ దగ్గరకు వెళ్ళి కిడ్డీబ్యాంక్ బొమ్మలు తెస్తుంటే పిల్లలూ, సుశీల ప్రశ్నార్థకంగా చూస్తుండిపోయారు.

"విస్సూగా! ఇవి నీ బొమ్మకు రవీ.... ఇవి నీ బొమ్మకూ...." అంటూ జీతం డబ్బుల్లో కొంత తీసి వాటిల్లో వేశాడు.

ముగ్గురూ రామారావుకేసి చిత్రంగా చూస్తున్నారు.

"ఇకపోతే.... ఇవి అమ్మకూ. " మాట సాగదీస్తూ మిగతా డబ్బు సుశీల చేతిలో పెట్టాడు, టీ కప్పు అందుకొని.

పిల్లలిద్దరూ పకపకా నవ్వేరు. "మరి నీకో...?" అడిగాడు విశ్వం తండ్రిని అనుకరిస్తూ.

"రోజు ఖర్చుకు అమ్మే ఇస్తుందిగా?" అన్నాడు తనే నవ్వేస్తూ. సుశీల కనులు ఆనందంతో సజలమైనాయి.

ఆ తర్వాత జీవితంలో మరెన్నడూ రామారావు సిగరెట్ అంటుకోలేదు.